RNI No. TEL/TEL/2018/76342

లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY

సామాజిక, రాజకీయ దిన పత్రిక

అధికారంలోకి రాగానే పుదుచ్చేరికి రాష్ట్ర హోదా : మల్లికార్జున్ ఖర్గే

పుదుచ్చేరికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా సాధించేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా సోమవారం జరిగిన ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ తాము ఏది చెప్పినా దాన్ని అమలు చేసి తీరుతామని అన్నారు.కానీ ప్రధాని మోదీ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం కేవలం కాంగ్రెస్, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకే సాధ్యమని అన్నారు. పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించే అంశం బీజేపీ మేనిఫెస్టోలో కనీసం ప్రస్తావనకు నోచుకోలేదని గుర్తుచేశారు.బీజేపీ మేనిఫెస్టో పుదుచ్చేరి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టలేదని దుయ్యబట్టారు.

ప్రచురణ : నిజామాబాద్ మంగళవారం 16-04-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 102 ° ఎజీలు : 4 వెల : రూ 2-00

గత పదేళ్ల ఎన్డీయే పాలన ట్రైలర్ మాత్రమే.. ఇంకా చేయాల్సింది చాలా ఉంది : ప్రధాని మోదీ

ఢిల్లీ:దేశంలో గత పదేళ్ల ఎన్డీయే పాలన పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖల్యు చేశారు. ఈ పదేళ్ల పాలనలో చూసింది కేవలం ట్రైలర్ మాత్రమేనని అన్నారు. ఇంకా చేయాల్సింది ముందు ముందు చాలా ఉందన్నారు. సోమవారం కేరళ రాష్ట్రంలోని కున్నంకుళం లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని పాల్గొని మాట్లాడారు. కేరళతోపాటు దేశ ప్రగతికి చేయాల్సింది చాలా ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'గత పదేళ్లలో జరిగింది కేవలం ట్రైలర్ మాత్రమే. కేరళ సహా భారత్ కోసం చేయాల్సింది ఇంకా చాలా ఉంది' అని అన్నారు.ఇక ఇదే సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ పేరును ప్రస్తావించకుండా ''కాంగ్రెస్ యువరాజు' తన కుటుంబ గౌరవాన్ని కాపాడుకోలేకపోయారు. యూపీలో తన కుటుంబానికి చెందిన స్థానాన్ని కాపాడుకోలేక మౌనంగా ఉన్నారు (ఏళ్ల తరబడి కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న అమేథీ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఉద్దేశిస్తూ). అయితే, కేరళ ప్రజల ప్రయోజనాల కోసం గొంతెత్తని ఆయన ఓట్లు మాత్రం అడుగుతాడు' అంటూ రాహుల్‌పై ప్రధాని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇక ఈ ఎన్నికల్లోనూ బీజేపీ కూటమిని ఆశీర్వదించాలని ఓటర్లను మోదీ అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీజేపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు.

ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు : కిషన్ రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తెలంగాణలో పన్నులు వసూలు చేసి ఢిల్లీలో ఇవ్వడానికి సమయం ఉంటుందని కాని రైతులను పట్టించుకునేందుకు లేదని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాయంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మార్పు కోసం కాంగ్రెస్‌కు ఓటేస్తే మారింది ఏమీ లేదన్నారు.రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను ఇంకా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పి ఇంకా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పంట నష్టపోయిన రైతులకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

లిక్కర్ కేసులో కవితకు రిమాండ్ పొడిగింపు

23 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధింపు
విచారణకు సహకరించడం లేదన్న సిబిఐ
బయట బిజెపి చెప్పిందే..సిబిఐ అడిగిందన్న కవిత

న్యూఢిల్లీ,ఏప్రిల్15: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. ఈ నెల 23 వరకు కవితకు రౌస్ అవెన్యూ జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కోర్టులిక్కర్ స్కామ్ కేసులో కవితను మూడు రోజులు సీబీఐ కస్టడీకి అప్పగించారు. ఈ మూడు రోజుల కస్టడీ నేటితో ముగియడంతో.. ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా సీబీఐ తరఫు న్యాయవాదులు, కవిత తరఫున న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరింది. సాక్ష్యాలను కవిత ముందు పెట్టి విచారించామని.. విచారణకు ఆమె సహకరించలేదని సీబీఐ ఆరోపించింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కవితను 9 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి అప్పగించింది. దీని ప్రకారం.. కవిత ఏప్రిల్ 23వ తేదీ వరకు జ్యూడీషియల్ కస్టడీలో ఉండనున్నారు. కోర్టులోకి వెళ్లే ముందు కవిత జై తెలంగాణ నినాదం చేశారు. వాదనల అనంతరం కోర్టు నుంచి బయటకు వచ్చిన ఆమె.. మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇది సీబీఐ కస్టడీ కాదని.. బీజేపీ కస్టడీ అని ఆరోపించారు. బయట బీజేపీ వాళ్లు అడగిందే.. లోపల సీబీఐ అడుగుతోందన్నారు. రెండు నెలల నుంచి అడిగిన ప్రశ్నలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని, కొత్తగా ఏమీ లేదన్నారు కవిత. కాగా, కవిత ఏప్రిల్ 23వ తేదీ వరకు తీహార్ జైల్లో ఉండనున్నారు. శరత్ చంద్రారెడ్డి నుంచి తీసుకున్న రూ.14 కోట్ల వ్యవహారంపై కవితను ప్రశ్నించామని.. లేని భూమి ఉన్నట్టుగా చూపి అమ్మకానికి పాల్పడిన విషయంపై ఆమె ఎలాంటి సమాధానం ఇవ్వలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేలా కవిత సమాధానాలు చెప్పిందని చెప్పుకొచ్చారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, గోరంట్ల బుచ్చిబాబు, శరత్ చంద్రారెడ్డి, విజయ్ నాయర్‌తో జరిగిన సమావేశాలపైనా ప్రశ్నించినట్లు తెలిపారు. అడిగిన ప్రశ్నలకు సూటిగా సరైన సమాధానాలు ఇవ్వకుండా తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. ఆమె విచారణను, సాక్షులను ప్రభావితం చేయగలిగిన పలుకుబడి కలిగిన వ్యక్తి అని అన్నారు. కేసుకు సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేయడంతో పాటు, చెరిపేసే అవకాశం ఉందన్నారు. కేసుకు సంబంధించి డిజిటల్ పరికరాలను, డాక్యుమెంట్లను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆమెకు 14 రోజుల పాటు జుడిషియల్ రిమాండ్ విధించాలని కోరుతున్నామని రిమాండ్ అప్లికేషన్‌లో సీబీఐ పేర్కొంది.

కొడంగల్ మీద మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే: హరీష్ రావు

హైదరాబాద్: కొడంగల్ మీద మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్ రావు తెలిపారు. కొడంగల్‌లో జర్నలిస్టులకు కూడా బెదిరింపులు వచ్చాయని మండిపడ్డారు. కొడంగల్‌కు కెసిఆర్ ఎన్నో మంచి పనులు చేశారని, కరివెన ప్రాజెక్టు పూర్తి చేశామని, కాలువ తవ్వితే నీళ్లు వస్తాయన్నారు. కరివెను ప్రాజెక్టు కాలువ పనుల టెండర్లను సిఎం రేవంత్ రెడ్డి రద్దు చేశారని మండిపడ్డారు. కొడంగల్ పర్యటిస్తున్న హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు? 13 హామీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. గెలిచినా ఓడినా ప్రజల మధ్య ఉండేది బిఆర్ఎస్ అని, పదేళ్లు అధికారంలో లో ఉంటూ ప్రజల కోసం పని చేశామని, ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. బిఆర్ఎస్ ఏం చేసిందంటే వంద స్కీములు చెబుతారని, బిజెపి ఏం చేసిందో చెప్పగలరా? అని ప్రశ్నించారు. పేదలు, రైతులు, దళిత, గిరిజనులకు బిజెపి ఏమైనా చేసిందా? అని అడిగారు. బిజెపి పెట్రోల్ ధర వందకు పైగా పెంచిందని, రూ.350 ఉన్న గ్యాస్ ధరను వెయ్యికి పెంచింది బిజెపి కాదా? అని హరీష్ రావు నిలదీశారు.ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బిజెపి మోసం చేసిందని దుయ్యబట్టారు. బిజెపి చెప్పుకోవడానికి ఏమీలేక దేవుడి ఫొటోలు, చీరలు పంచుతున్నారని చురకలంటించారు. తెలంగాణకు మోడీ ప్రభుత్వం ఒక్క మెడికల్ కాలేజీ, నవోదయ స్కూల్ ఇవ్వలేదని, పాలమూరు ఎత్తిపోతలకు జాతీయ హోదా ఇవ్వలేదని, పాలమూరు లిఫ్ట్ పూర్తి చేస్తామని గత ఎన్నికల్లో పిఎం మోడీ హామీ ఇచ్చారని, ఐదు సంవత్సరాలు అయినా పాలమూరు లివ్వకు కేంద్రం ఎందుకు అనుమతులు ఇవ్వలేదని అడిగారు. కల్యాణ లక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం ఏమైందని రేవంత్‌ను సూటిగా హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇవ్వకపోతే తాను ఇస్తానని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ చెప్పిందని, ఎవరికైనా ఇచ్చిందా? అని నిలదీశారు. డిసెంబర్ 9నాడే రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారని, రుణమాఫీ అయిన వాళ్లంతా కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ కాని వాళ్లంతా బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు.

ఆరెస్సెస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం : రాహుల్ గాంధీ

ఆరెస్సెస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఇవాళ కీలక పోరాటం జరుగుతున్నదని కాంగ్రెస్ ఎంపీ, వయనాడ్ లోక్‌సభ అభ్యర్థి రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాషాయ నేతలు, ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పుడు ఒకే దేశం..ఒకే ఎన్నికలు, ఒకే నేత, ఒకే భాష అని మాట్లాడుతున్నారని, భాష గురించి ఏ ఒక్కరూ ప్రజలను నిర్దేశించలేరని అన్నారు.భాష అనేది మనిషి లోపలినుంచి, హృదయం నుంచి పలికేదని చెప్పారు. హిందీ కంటే మీ భాష తక్కువని కేరళక చెందిన వ్యక్తితో అనడమంటే అది కేరళ ప్రజలను అవమానించినట్టేనని పేర్కొన్నారు. వయనాడ్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడారు.భారత్‌కు ఒకే నేత ఉండాలనే ఆలోచన దేశంలో ప్రతి ఒక్కరికీ అవమానకరమని రాహుల్ అన్నారు. మత విద్వేషాలు రేకెత్తిస్తూ కాషాయ పార్టీ ప్రజల మధ్య విభజన చిచ్చు రేపుతోందని దుయ్యబట్టారు.

లోక్ సభ ఎన్నికల చరిత్రలోనే.. తొలి విడతలో రికార్డు స్థాయిలో పట్టుబడిన నగదు

ఢిల్లీ: ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుంటారన్న విషయం తెలిసిందే. తమ గెలుపుకోసం ఓటర్లకు డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాలు, బంగారం, వెండి, ఖరీదైన వస్తువులను ఇస్తుంటారు. ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధం. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రలోభాలను కట్టడి చేసేందుకు తమ వంతు ప్రయత్నిస్తుంటుంది. ఈసీ ప్రతి రాష్ట్రంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తూ.. డబ్బు, మద్యం రవాణాను కట్టడి చేస్తుంటుంది. ఈ క్రమంలో దేశంలో ఎన్నికల సమయంలో కట్టల కొద్దీ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు పట్టుపడుతుంటాయి. అయితే ఈ సారి మాత్రం రికార్డు స్థాయిలో రికవరీ జరిగింది. గత 75 ఏళ్ల లోక్‌సభ ఎన్నికల చరిత్రలోనే అత్యధిక మొత్తం 2024 ఎన్నికల సమయంలో పట్టుబడినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా వెల్లడించింది. ఈసీఐ వెల్లడించిన డేటా ప్రకారం.. మార్చి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు తొలి విడతలో డబ్బు, మద్యం, బంగారం, ఇతర వస్తువుల రూపంలో మొత్తం రూ. 4,650 కోట్లు రికవరీ అయ్యింది. అంటే సగటున రోజుకు రూ. 100 కోట్ల మేర రికవరీ జరిగినట్లు. ఇందులో నగదు రూ.395.39 కోట్లు కాగా, బంగారం, వెండి వంటి విలువైన

లోహాల రూపంలో రూ.562.10 కోట్లు రికవరీ చేసినట్లు ఈసీ తెలిపింది. అలాగే రూ.489.31 కోట్ల విలువ చేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం పట్టుపడినట్లు పేర్కొంది.ఈ ఏడాది మొత్తం రికవరీలో సింహభాగం మాదకద్రవ్యాలదే కావడం గమనార్హం. రూ.4,650 కోట్ల రికవరీలో 45 శాతం మేర మాదక ద్రవ్యాలే ఉన్నట్లు ఈసీ తెలిపింది. మొత్తంగా రూ.2,068.85 కోట్ల విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. 2019 ఎన్నికల సమయంలో రూ. 1,279.9 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఇక టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, బహుమతుల రూపంలో రూ. 1,142.49 కోట్ల మేర స్వాధీనం చేసుకున్నట్లు ఈసీ వివరించింది. 75 ఏళ్ల లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఇదే అత్యధిక మొత్తం అని ఈసీఐ తన డేటాలో వెల్లడించింది.గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూ. 3,475 కోట్లకు పైగా పట్టుబడింది. గత ఎన్నికల సమయంలో పట్టుబడిన దానితో పోలిస్తే ఇది 34 శాతం అధికమని తెలిపింది. సమగ్ర ప్రణాళిక, సంయుక్త కార్యాచరణ, దర్యాప్తు సంస్థలు, భద్రతా బలగాల మధ్య సమన్వయంతో పాటు పౌరుల సహకారంతోనే ఇంత పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకోగల్గుతున్నామని ఈసీ ఒక ప్రకటనలో పేర్కొంది.ఇక దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వివిధ రూపాల్లో ఈసీ స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 4,658 కోట్లలో రాజస్థాన్ తొలి స్థానంలో నిలిచింది.

తెలంగాణలో పది మంది ఓటర్ల కోసం రెండు పోలింగ్ బూత్ లు

హైదరాబాద్: ప్రతి ఓటుకు విలువ ఇవ్వాలన్న లక్ష్యంతో ఎన్నిలక సంఘం అతి పిన్న అనుబంధ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తోంది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేసింది. ఇది వరలోనైతే కొన్ని ప్రాంతాల్లో 20 కిమీ. దూరం వెళ్లి ఓటేయాల్సి వచ్చేది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లో మార్పులు తెచ్చారు.నాగర్ కర్నూల్ లోని అచ్చంపేట్ అసెంబ్లీ నియోజకవర్గంలో మల్లాపూర్ 'పెంట' వద్ద కేవలం 10 మంది ఓటర్ల కోసం అనుబంధ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా నలగొండలోని దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో బుదిద్ గట్టులోని అంగన్ వాడీ కేంద్రంలో అనుబంధ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా ఓటర్లు పది మందే.తెలంగాణలోని నాగర్ కర్నూల్, నల్గొండ, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో మొత్తంగా 10 అతి పిన్న పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల సంఖ్య 10 నుంచి 26 మందే. వీరిలో చాలావరకు ఎస్టీలు, చెంచులు, లంబాడీలు, కోయ జాతికి చెందిన వారు. ఇదివరలో వీరు మూడు నుంచి 20 కిమీ. దూరం వరకు వెళ్లి ఓటేసేవారు.రాష్ట్రంలో 17 లోక్ సభ స్థానాలకు మే 13 న పోలింగ్ జరుగనున్నది.

సుప్రీంలోనూ కేజ్రీకి దక్కని ఊరట

అరెస్ట్‌పై విచారణ 29కి వాయిదా
సమాధానం ఇవ్వాలంటూ ఇడికి నోటీసులు

న్యూఢిల్లీ,ఏప్రిల్15 : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌కు సుప్రీంకోర్టులోనూ నిరాశే ఎదురైంది. కేజీవ్రాల్‌కు అత్యున్నత న్యాయస్థానంలోనూ ఊరట లభించలేదు. ఈడీ అరెస్ట్‌ను సవాల్ చేస్తూ కేజీవ్రాల్ పిటిషన్ వేశారు. ఈ అరెస్ట్ ఛాలెంజ్ పిటిషన్‌ను ఏప్రిల్ 29న విచారిస్తానని జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం స్పష్టం చేసింది. అదే సమయంలో కేజీవ్రాల్ అరెస్ట్‌పై ఈడీకి నోటీసులు జారీ చేసింది సుప్రీం ధర్మాసనం. ఏప్రిల్ 24వ తేదీ లోపు సమాధానం చెప్పాలని ఈడీని ఆదేశించింది సుప్రీంకోర్టు. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేయాలంది. ఈడీ అరెస్ట్, ట్రయిల్ కోర్టు కస్టడీని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో కేజీవ్రాల్ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు.. కూడా తన అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ రౌస్ అవెన్యూ కోర్టులో, ఢిల్లీ హైకోర్టులో సైతం పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను రెండు కోర్టులు తిరస్కరించగా.. ఇప్పుడు సుప్రీంకోర్టు సైతం విచారణను తరువాత చేస్తానని చెప్పింది. దీంతో కేజీవ్రాల్ మరికొన్ని రోజులు జైల్లో ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదిలాఉంటే.. ఢిల్లీ లిక్కర్ కేసులో సీఎం కేజ్రివాల్‌కు ఏప్రిల్ 23వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించింది రౌస్ అవెన్యూ కోర్టు. కేజీవ్రాల్ ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు. దీంతో ఆయన్ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. ల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కి నోటీసులు జారీ చేసింది. అయితే కేజీవ్రాల్‌కు మధ్యంతర ఉపశమనం లభించలేదు. కేజీవ్రాల్ పిటిషన్‌పై తక్షణ విచారణకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 24న నోటీసులపై సమాధానమిస్తామని ఇడి తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఎఎస్‌జి ఎస్.వి. రాజులు కోర్టుకు తెలిపారు. లిక్కర్ స్కామ్‌కి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజీవ్రాల్ అరెస్టును ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. ఇడి అరెస్టు చట్టవ్యతిరేకం కాదని జస్టిస్ స్వర్ణకాంత పేర్కొన్నారు. దీంతో తన అరెస్టును సవాలు చేస్తూ కేజీవ్రాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న ఇడి అధికారులు కేజీవ్రాల్‌ను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయనకు 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. ఆ కస్టడీ కూడా నేటితో ముగియనుండటంతో కేజీవ్రాల్‌ను నేడు కోర్టులో హాజరుపర్చనున్నారు.

సంపాదకీయం

మంగళవారం 16-04-2024

ఎన్నికలను ముంచెత్తుతున్న ఫేక్...

భారత అత్యున్నత ప్రజాస్వామ్యం అని ఎందుకు అంటామంటే ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ జరుగుతుందనే. భారత ప్రజాస్వామ్యానికి ఎన్ని రకాల అవలక్షణాలు ఉన్నా ప్రజల చైతన్యంతో ఎప్పటికప్పుడు మన గలుగుతూనే ఉంది. అయితే ఇప్పుడు అతి పెద్ద సవాల్ ఫేక్ న్యూస్ రూపంలో వస్తోంది. సోషల్ మీడియా ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా మారుతోంది. ఎలాంటి అథంటికేషన్ లేకుండా ఫేక్ న్యూస్ ప్రచారానికి ఇది ఆయుధంగా మారింది. సోషల్ మీడియా రూపం మారిపోతోంది. ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీల సోషల్ మీడియా సైన్యాలు.. తప్పుడు వార్తలు, మార్ఫింగ్ ఫోటోలు, నకిలీ వీడియో పోస్టులతో హల్ చల్ చేస్తున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు.. ఇప్పుడు ఏపీలోని ప్రధాన రాజకీయ పార్టీల సోషల్ మీడియా వింగ్‌లు విశ్వరూపం చూపిస్తున్నాయి. ఒకరు చేసిన దానికి మరొకరు కౌంటర్ గా ఫేక్ పోస్టులు వైరల్ చేసుకుంటున్నారు. ఇటీవల ఇది పెరిగిపోయింది. సోషల్ మీడియాలోని ఫేస్ బుక్, వాట్సాప్ , ఇతర ప్లాట్ ఫామ్స్ లో ప్రధాన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులపైన, కార్యకర్తల పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వ్యక్తిగత ఆరోపణలకు, దూషణలకు దిగుతూ తద్వారా సదరు రాజకీయ పార్టీల మధ్య ఉద్రిక్తతలను, ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్న సందర్భాలు కూడా పెరిగిపోతున్నాయి. నిజానికి సోషల్ మీడియా అనేది సమాచార వ్యాప్తికి అత్యంత సులభమైన, తక్కువ ఖర్చు మాధ్యమం. అయితే ఇదే అది పెద్ద సవాలుగా మారింది. ఫేక్ న్యూస్ పై దేశం, సమాజం మొత్తం సీరియస్‌గా ఆలోచించాలి. ఫేక్ న్యూస్ కోసం ప్రత్యేక అకౌంట్లను, వెబ్ సైట్లను సృష్టిస్తున్నారు. అనేక పత్రికలు కూడా ఫేక్ న్యూస్ వార్తలను ప్రచురిస్తున్నాయి. మిగతా రాష్ట్రాల్లో రాజకీయం వేరు..ఎన్నికలు వస్తే చాలు ఫేక్ న్యూస్ వెల్లువలా సోషల్ మీడియాలో వెల్లువెత్తుతోంది. ప్రముఖ సంస్థల పేర్లు వాడుకుని డీప్ ఫేక్ వీడియోలు చేయడం దగ్గర్నుంచి కొత్త కొత్త టెక్నాలజీని వాడుకుని ప్రజల్లో గందరగోళం గురి చేయడం వరకూ రాజకీయ పార్టీ దేన్నీ వదులుకోవడం లేదు. దీని వల్ల ఎన్నికలు ప్రభావితం అవుతున్నాయని తెలిసినా ఒక్కటంటే ఒక్క వ్యవస్థ కూడా చర్యలు తీసుకోలేకపోతోంది. 2020లో దుబ్బాక ఉపఎన్నిక జరిగింది. రేపు పోలింగ్ జరుగుతుందనగా.. కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ఎస్‌లో చేరిపోయారని ఓ ప్రముఖ చానల్ లో వచ్చిందన్నట్లుగా ఓ వీడియో వైరల్ చేశారు. అది ఫేక్ అని అందరికీ తెలిసే సరికి పోలింగ్ అయిపోయింది . నమ్మిన వారు చాలా మంది తమ ఓటింగ్ ప్రయారిటీ మార్చుకున్నారు. ఇది ఒక్క ఉదాహరణే ఎప్పుడు .. ఎక్కడ ఎన్నికలు జరిగినా లెక్కలేన్ని ఫేక్ పోస్టులు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. తాజాగా కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో సర్వే అంటూ ఓ తెలుగు మీడియా చానల్ లో సర్వే వచ్చిందని వీడియో వైరల్ అయింది. అది డీప్ ఫేక్ వీడియోగా తేల్చి ఆ చానల్ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ సంస్థలకు ఉన్న విశ్వసనీయతను ఇలా రాజకీయ పార్టీల సానుభూతిపరులు తమకు అనుకూలంగా మల్చుకునేందుకు ఏ మాత్రం ఆలోచించడం లేదు. తర్వాత ఎలాంటి పరిణామాలు చర్యలు ఉండవు కాబట్టి.. ఫేక్ అని తెలిసినా సరే ప్రజల్లోకి పంపుతున్నారు. దాన్ని నమ్మేవారు ఉంటారు. వాళ్లే టార్గెట్. రాజకీయ పార్టీలకు కావాల్సింది అదే. తాము ఏమీ చెప్పినా నమ్మేవారిని రాజకీయ పార్టీలు సృష్టించుకుంటున్నాయి. ఏపీలో రాజకీయం వేరు. రేపే ఎన్నికలన్నంత హడావుడి.. ఫలితాలొచ్చిన తర్వాతి రోజు నుంచే ఉంటుంది. ఏ రాజకీయ పార్టీ కూడా విశ్రాంతి తీసుకోదు. ఆయా పార్టీల కార్యకర్తలూ అంతే. అయితే.. ఇక్కడ సమస్య అంతా... రాజకీయ పార్టీల స్ట్రాటజీ వల్లనే వస్తోంది. తమకు వ్యతిరేకం అయినా...ప్రత్యర్థి పార్టీపై అవాస్తవాలు చాలావేగంగా ప్రచారం చేసి.. ఎక్కువ మంది నమ్మేలా చేయగలిగితే..చాలని అనుకుంటున్నాయి. ఇందు కోసం.. ఆన్ లైన్ టీముల్ని నియమించుకుంటున్నాయి. ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. స్పష్టంగా కనిపిస్తున్న విషయాలను కూడా వక్రీకరిస్తున్నారు. ఫలితంగా ప్రజలు కూడా అసలు నిజలేంటో అంచనా వేసులేకపోతున్నారు. తమ రాజకీయ అభిప్రాయాలకు అనుగుణంగా ఉన్న వార్తను.. నమ్మి సంతృప్తి పడుతున్నారు. కానీ వారికి అసలు నిజం తెలియడం లేదు. తెలిసిన నమ్మలేనంతగా రాజకీయ పార్టీలు ఆ విషయానికి మసిపూసి మారేడు కాయ చేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. తెలంగాణా ఎన్నికలు 2023కి ముందు, ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కూడా ఈ టెక్నాలజీకి బలైపోయాడు. ప్రముఖ కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.సీఎం కేసీఆర్ రాజకీయ పార్టీ భారత రాష్ట్ర సమితి పై కాంగ్రెస్ సీనియర్ నాయకుడి డీప్‌ఫేక్ పరువు నష్టం కలిగించే, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఇందులో చూపిస్తోంది. ఆయన మాత్రమే కాదు, డీప్‌ఫేక్‌లు ఈ ఎన్నికల సీజన్‌లో ఒక పోల్ ప్రాక్టీస్‌గా మారాయి. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఇవి కామన్ గా మారుతున్నాయి. సోషల్ మీడియాలో ట్సప్ గ్రూపులలో ఇలాంటి వివాదాస్పద పోస్టింగులు చేస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ, రాజకీయ, వర్గ ఘర్షణలు లేవనెత్తుతూ పరపతికి భంగం కలిగేలా వ్యవహరిస్తుంటేవాట్సాప్ గ్రూపుల అడ్మిన్లను కూడా బాధ్యులను చేస్తామనిపోలీసులు హెచ్చరిస్తున్నారు.

నేడు తెలుగు నాటకరంగ దినోత్సవం



-సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 16న నిర్వహిస్తారు. ఆధునిక తెలుగు నాటకరంగంలో తొలి నాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడైన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని 2007లో తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్ణయించడం జరిగింది. నాటక ప్రదర్శనతోపాటు నాటకానికి సంబంధించిన అనేక అంశాలపై సదస్సులు జరగాలని, నాటక కళాకారుల జయంతులను వర్ధంతులను నిర్వహించడం ద్వారా ప్రజల్లో నాటక కళ పట్ల ఉత్సాహం, విలువలు పెరుగుతాయని, వీటన్నింటిని సమతుల్యం చేసేలా ఉండేందుకు నాటకరంగ దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకోవాలని తెలుగు నాటక కళాకారులు భావించారు. అయితే, ఏ రోజును నాటకరంగం దినోత్సవంగా చేయాలన్న అంశంపై అనేక చర్చలు జరిగాయి. అనేకమంది అనేక పేర్లూ, తేదీలు సూచించారు.దీనికి 2000వ సంవత్సరంలో బీజం పడింది. 2000వ సంవత్సరంలో కొంతమంది యువనాటక కళకారులతో కలిసి డా. పెద్ది రామారావు ఆధ్వర్యంలో యవనిక త్రైమాసిక నాటకరంగ పత్రిక ప్రారంభమయింది. నాలుగేళ్ళపాటు నడిచిన ఈ పత్రికలో ప్రపంచ, భారతీయ, తెలుగు నాటకరంగాలకు సంబంధించి నాటక ముఖ్యులు, ఔత్సాహికులు రాసిన అనేక వ్యాసాలను యవనిక ప్రచురించడంతోపాటు నాటకరంగ కార్యక్రమాలు, నాటకోత్సవాలను కూడా నిర్వహించింది. నాటకరంగాన్ని మరింత పటిష్టపరచడంకోసం ఇతర దేశాల, రాష్ట్రాల నాటకరంగానికి ఉన్నట్లుగా తెలుగు నాటకరంగానికి కూడా ఒక దినోత్సవం ఉంటే బాగుంటుందని భావించి, "ఏప్రిల్ 16 తెలుగు నాటక దినోత్సవం" శీర్షికతో 2000 ఏప్రిల్-జూన్ ప్రత్యేక యవనిక సంచికను ప్రచురించింది. యవనిక ఆలోచనకు "ఆంధ్రప్రదేశ్ రంగస్థల కళాకారుల ఐక్య వేదిక" సహకారం తోడైంది. తెలుగు నాటక కళాకారులంతా నాటకరంగ దినోత్సవ ఏర్పాటుపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 19వ శతాబ్దంలో అనువాద నాటకాలకు అధిక ప్రాధాన్యమున్న సమయంలో ప్రదర్శనలను దృష్టితో ఉంచుకొని కందుకూరి వ్యవహార ధర్మబోధిని అనే నాటకం రాసి, షేక్స్పియర్ రాసిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే ఆంగ్ల నాటకాన్ని చమత్కార రత్నావళి పేరుతో 1880లో అనువదించి తన విద్యార్థుల చేత ప్రదర్శింపచేశాడు. అంతేకాకుండా తెలుగు నాటకరంగంలో తొలి నాటక సమాజాన్ని కూడా వీరేశలింగమే స్థాపించాడు. ఆధునిక తెలుగు నాటకరంగానికి విశిష్ట సేవలను అందించిన కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని నాటక సంస్థలు 2001 నుండి తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపాయి. ఈ క్రమంలో డా. కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళగా, కందుకూరి వీరేశలింగం పంతులు జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా ప్రకటిస్తూ 2007 మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ. విడుదలచేసింది. 2007, ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా తెలుగు నాటకరంగ దినోత్సవం జరుపబడింది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తారు. తెలుగు నాటకరంగంలో విశేష కృషి చేసిన నాటక కళాకారులకు సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు, బిరుదులు అందజేస్తారు.

కమలంలో సమన్వయ లోపం

హైదరాబాద్, ఏప్రిల్ 15, లోక్‌సభ ఎన్నికల వేళ తెలంగాణ ఎంపీ అభ్యర్థులు, నేతల వైఖరితో బీజేపీ హైకమాండ్ తలలు పట్టుకుంటోంది. నేతల మధ్య జరగుతున్న పోరుతో కొత్త సీట్ల సంగతి అలా పెడితే, ఉన్న సీట్లు కూడా గెలుచుకోవటం కష్టమేనని ఆ పార్టీ నేతలు భయపడుతున్నారు. అగ్రనాయకులంతా వర్గాలుగా విడిపోయి, ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రత్యర్థులను ఓడించే పనిలో పడటంతో ఎన్నడూ లేని ఈ మితిమీరిన వర్గపోరు ఎటు దారి తీస్తుందో అని పార్టీ అధిష్ఠానం బెంబేలెత్తుతోంది. అమిత్ షా హెచ్చరికలనూ లెక్కచేయకుండా కొందరు నేతలు రచిస్తున్న వ్యూహాలు.. మొదటికే మోసం తేనున్నాయనే వార్తలూ వినిపిస్తున్నాయి.తెలంగాణ బీజేపీ నాయకులంతా ఇప్పుడు కొత్త, పాత నాయకులనే రెండు తరగతులుగా విడిపోయారు. పాత నాయకులంటే అనాదిగా పార్టీనే నమ్ముకుని ఉన్నవారు. వీరికి సంఘ నేపథ్యంతో బాటు జాతీయవాద భావజాలం, సామాజిక సమరసతా లక్ష్యాల వంటివాటితో బాటు గెలుపోటములతో సంబంధం లేకుండా పార్టీకి సేవలందించిన చరిత్ర ఉంది. ఇక.. కొత్త నాయకులు అంటే, వేరే పార్టీల నుంచి వలస వచ్చిన నేతలు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీ వంటి పార్టీల నుంచి వచ్చినవారే. బీజేపీలో చేరిన ఈ నేతలకు అధిష్ఠానం అధిక ప్రాధాన్యం ఇవ్వటం పాతతరం నేతలకు కంటగింపుగా మారుతోంది. ఉదాహరణకు ఇటీవలి ఎన్నికల్లో నాగర్ కర్నూలు, జహీరాబాద్, వరంగల్, నల్గొండ, వరంగల్ వంటి సీట్లలో ప్రకటించిన అభ్యర్థులంతా వలస వచ్చినవారే. వీరిలో కొందరు పార్టీ మారిన మూడు రోజుల్లో టికెట్ కూడా సంపాదించగలిగారు. ఇది నచ్చని పాత నేతలు, కార్యకర్తలు వీరికి ఎన్నికల వేళ సహాయ నిరాకరణ చేస్తున్నారు. ఇక, డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి వంటి వారూ పాతతరం నేతల దృష్టిలో నేటికీ వలస పక్షులే. ప్రచారం జోరుగా చేయాల్సిన ఈ కీలక సమయంలో పాత నేతలెవరూ వీరికి మద్దతుగా నిలవటం లేదుబీసీ నేతగా బలమైన మార్పు తీసుకొచ్చాడనే పేరున్న బండి సంజయ్‌ను తప్పించటంలోనూ ఇలాంటి రాజకీయమే గతంలో పనిచేసింది. అప్పట్లో ఆయన అవలంబించిన దూకుడును, ఒంటెత్తుపోకడగా అభివర్ణిస్తూ బీసీ నేతలే ఆయనకు అండగా నిలవలేదు. ఈ విషయంలో బీసీ వర్సెస్ నాన్ బీసీ అనే ప్రాతిపదికన తెలంగాణ బీజేపీ విడిపోయింది. కిషన్ రెడ్డి నాయకత్వంలో ఈ రాజకీయం సాగినట్లు అప్పట్లో వార్తలూ వచ్చాయి. దీనికి తోడు బండి సంజయ్, ప్రొ. లక్ష్మణ్, ధర్మపురి అరవింద్ వంటి వారంతా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వారే కావటంతో పెత్తనమంతా ఒకే బీసీ వర్గం చేస్తుందనే భావనా తెలంగాణ బీజేపీ నేతల్లో ఉంది. తర్వాత పార్టీలో చేరిన ఈటల రాజేందర్ వంటి ఇతర కులాల నేతలకు తగినంత గుర్తింపు రాకుండా మున్నూరు కాపు నేతలు ప్రయత్నించారనే ఆరోపణ కూడా ఉంది. దీంతో బీజేపీ సానుభూతి పరులైన ఇతర బీసీ కులాలు పార్టీకి దూరమయ్యే పరిస్థితి నెలకొంటోంది.తాజా లోక్‌సభ ఎన్నికల వేళ.. ఒకే సామాజిక వర్గానికి చెందని నేతలు తోటి నేతల ఓటమికి అంతర్గతంగా పనిచేస్తున్నారనే మాటా ప్రస్తుతం వినిపిస్తోంది. కేంద్రంలో కేంద్ర పదవి దక్కే అవకాశం వస్తే.. తమ వర్గానికి చెందిన నేతలు పోటీవస్తారనే భయంతోనే వీరు తోటి అభ్యర్థుల ఓటమికి కుట్రలు చేస్తున్నారని, కొందరు నేతలు ఇంకొక అడుగు ముందుకు వేసి ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు సాయం అందిస్తున్నారనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు డబ్బు, పరపతి, వ్యాపారాలున్న నేతలకు పార్టీలో ఎక్కువ విలువ దక్కుతోందని, అనేక విషయాల్లో వారి మాటే చెల్లుబాటవుతోందని పాత తరం నేతలు లోలోపల వాపోతున్నారు. ఇలాంటి వలస నేతలు పార్టీ కష్టకా లంలో అలవోకగా తమ సొంత పార్టీలకు తిరిగెళ్లి పోతారని, కనుక ఇలాంటి కార్పొరేట్ ధోరణులు పార్టీకి చేటు చేస్తున్నాయనేది వారి వాదన.తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ సీట్లుండగా వాటిలో సగానికి పైగా వలస నేతలే టికెట్లు దక్కించుకోవటం, వారితో బాటే వారి అనుచరులూ పార్టీలో చేరి పెత్తనం చెలాయించటం కూడా ఎన్నికల వేళ కొత్త సమస్యలు తెచ్చిపెడుతోంది. దీనివల్ల పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించి, ఎవరికి వారుగా వ్యవహ రిస్తున్నారు. దీనివల్ల ముందునుంచీ సాగుతోన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాలన్నీ మూలనఎ ్డాయి. ఈ విషయాలను పార్టీ ఇన్‌ఛార్జ్‌లు ఢిల్లీలోని పెద్దలకు చెప్పినా పరిస్థితి లో ఏ మార్పూలేదని, నిన్నటి దాకా అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకతను ఓటు బ్యాంకుగా మార్చుకోవటానికి ప్రయత్నించిన తమ పార్టీ, కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ నష్ట నివారణ చర్యలకు దిగాల్సి రావటం దురదృష్టమని ఆ పార్టీ అభిమానులు ఆక్రోశిస్తున్నారు.

తెలంగాణపై జనసేన ఫోకస్

హైదరాబాద్, ఏప్రిల్ 15 (తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జనసేన సిద్ధమవుతోందా అంటే అవుననే అంటున్నాయిన పార్టీ శ్రేణులు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభానికి ఐదు రోజుల ముందు జనసేనాని పవన్ కళ్యాణ్ సమన్వయకమిటీ ఏర్పాటు చేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఇప్పటికే ఏపీలో టీడీపీ?జనసేన?బీజేపీ కూటమిగా ఎన్నికల బరిలో దిగాయి. పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తోంది.ఇక ఏపీలో జనసేన టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పి వైసీపీలోకి క్యూ కట్టారు. తమకు టికెట్లు ఇవ్వలేదనే బాధ కంటే.. పక్క పార్టీల నుంచి పిలిచి మరి టికెట్ ఇవ్వడంపై జనసేన నేతలు మండిపడుతున్నారు. ఇప్పటికే పోతిన మహేష్, మనుక్రాంత్‌రెడ్డి, పితాని బాలకృష్ణ, పాముల రాజేశ్వరి సహా పలువురు నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పారు. మరికొందరు అదే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీంతో జనసేనాని అలర్టయ్యారు. మొన్నటి వరకు అసంతృప్తులపై కన్నెత్తి కూడా చూడని పవన్ కల్యాణ్ ఇప్పుడు వారిని బుజ్జగించే పనిలో పడ్డారు.మరోవైపు జనసేనాని తెలంగాణపై కూడా ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల కోసం సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. బొంగునూరి మహేందర్‌రెడ్డి సమన్వయకర్తగా, శంకర్‌గౌడ్, రాజలింగం, పొన్నూరి శిరీష, ప్రేమ్‌కుమార్, ములుకుంట్ల సాగర్ సభ్యులుగా ఉంటారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తులో భాగంగా 7 స్థానాల్లో పోటీ చేసిన జనసేన ఆశించినమేర సక్సెస్ కాలేదు. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణలో ఖాతా ఓపెన్ చేస్తుందా లేదా అనేది చూడాలిఆంధ్రప్రదేశ్‌లోనే ఒంటరిగా పోటీ చేయడానికి వెనుకాడిన పవన్ కళ్యాణ్ తెలంగాణలో ఒంటరిగా పోటీ చేసే సాహసం చేయరని విశ్లేషకులు అభిప్రాపయడుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని పోటీ చేయకపోవచ్చని భావిస్తున్నారు. మరోవైపు ఏపీలో మిత్రపక్షంగా ఉన్న బీజేపీ, ఇప్పటికే తెలంగాణలో 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ పోటీకి దూరంగా ఉంది. ఈ క్రమంలో జనసేన హడావుడి చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రత్యక్షంగా పోటీ చేస్తారా లేక గతంలో లాగా ఇతర పార్టీలకు మద్దతు ఇస్తారా అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది

ఎండిన పంటలను చూసేది లేదు.. రైతులకు భరోసా ఇచ్చేది లేదు: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్: సాగు నీరులేక పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. హస్తం పార్టీ నేతలు పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీ మేరకు పంటకు బోనస్ ఇస్తారో లేదో చెప్పాలన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జలాశయాల్లో నీటి లభ్యత ఉన్నా ప్రభుత్వ నిర్వహణ లోపం వల్ల ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తున్నారు. ఒక్క మార్చి నెలలోనే అధికారిక లెక్కల ప్రకారం 1 లక్ష 45 వేల ట్యాంకర్లను వాడారని చెప్పారు. ఇవి కాక ఎన్ని రెట్లు ప్రైవేట్ ట్యాంకర్లు నీళ్ల వ్యాపారం చేశారో కళ్లారా చూస్తున్నామని విమర్శించారు.యాసంగి పంటలు వస్తున్నా వరి ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలో ఇప్పటికీ స్పష్టలేదన్నారు. యాసంగి పంటను కనీస మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో 65 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి పెంచామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీ నుంచి చేరికలపై దృష్టి పెట్టిందన్నారు. కేసీఆర్ హయాంలో సాగు, తాగునీటికి కొరత రాలేదని తెలిపారు. రైతుల ఆత్మహత్యల వివరాలు పంపినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. ఆత్మహత్య చేసకున్న రైతు కుటుంబాలను పరామర్శించడం లేదని చెప్పారు. ఎండిన పంటను చూసేది లేదు.. రైతులకు భరోసా ఇచ్చేది లేదన్నారు. పాలనపై, ప్రజలపై మంత్రులకు ఎలాంటి శ్రద్ధ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.కేసీఆర్ మీద కోపంతో మహనీయుడు అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని ఆరోపించారు. కేసీఆర్ కట్టించాడన్న అక్కసుతో ప్రజలు, ప్రజా సంఘాలు అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వెళ్లకుండా తాళం వేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరి అప్పుడు కేసీఆర్ కట్టించిన సెక్రటేరియట్‌లో కూర్చోకండని వెల్లడించారు. కేసీఆర్ కట్టించిన మిషన్ భగీరథ నుంచి నీళ్లు ఇవ్వకుండా మీరు సొంత కార్యక్రమంతో నీళ్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ అంటే మొదటి నుంచి గిట్టదన్నారు.

తెలంగాణకు వర్ష సూచన.. 10 రోజుల పాటు..

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని వార్త అందించింది. వచ్చే పది రోజుల పాటు ఎండ తీవ్రత తగ్గి.. పలు చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.తర్వాత ఎండ తీవ్రత పెరిగే సూచనలు ఉన్నట్టు స్పష్టం చేసింది.కాగా, వర్షాల కారణంగా తగ మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు కాస్త పడిపోయాయి. వచ్చే పది రోజులపాటు అంటే.. ఈ నెల 25 వరకు రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అంచనా వేసింది.రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజులపాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నది. మరోవైపు గురు, శుక్ర, శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇక, అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంటోన్మెంట్ అభ్యర్థిగా కొప్పు భాష...

హైదరాబాద్, ఏప్రిల్ 15 తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలతోపాటు కంటోన్మెంట్ ఉప ఎన్నిక కూడా జరుగనుంది. ఈమేరకు అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీ ఈ సీటుపై కన్నేశాయి. మాజీ ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందితకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ గద్దర్ కూతురు వెన్నెలను, బీజేపీ శ్రీగణేశ్‌ను బరిలో దించాయి. ఎన్నికల్లో గెలిచిన లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. దీంతో ఉప ఎన్నికల్లో ఈ సీటును నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్, తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన శ్రీగణేశ్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. ఇక లాస్య నందిత దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి నివేదితకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. మొన్నటి ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన బీజేపీ ఈసారి ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. ఈమేరకు గట్టి అభ్యర్థిని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తోంది.పార్టీ కోసం కష్టపడే వారికి కంటోన్మెంట్ టికెట్ ఇవ్వాలని కమలం పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ అభ్యర్థిగా ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాష పేరు వినిపిస్తోంది. భాష దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి. రంగారెడ్డి జిల్లా యాచారం ఆయన స్వగ్రామం. చిన్నతనం నుంచి జాతీయ భావాలు కలిగిన నేత. విద్యార్థి ఉద్యమాల్లోనూ కీలకంగా వ్యవహరించారు. 1999 నుంచి ఏబీవీపీలో చురుకైన విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం మొదలుపెట్టారు. అంచెలంచెలుగా ఎదిగి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేసి కేసుల పాలయ్యారు. 2009లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2012లో బీజేవైఎం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

పెద్దపల్లిలో ట్రైయాంగిల్ ఫైట్

కరీంనగర్, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)పార్లమెంటు ఎన్నికలపై ప్రధాన పార్టీలన్నీ ఫోకస్ పెట్టాయి.. పెద్దపల్లి లోక్‌సభ స్థానంలో త్రిముఖ పోరు నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు ప్రచార స్పీడ్‌ను పెంచాయి. మూడు పార్టీల అభ్యర్థులు ఖరారు అయిన నేపథ్యంలో ప్రచారంలో ఎత్తులు పైఎత్తులు వేస్తున్నాయి. ప్రతి ఒక్కరిని కలిసి ఓటును అభ్యర్థిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నాయకులు గెలుపుపై ధీమాని వ్యక్తం చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మూడు పార్టీల అభ్యర్థులు గత పదిహేను రోజుల నుండి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ ఇక్కడ పార్లమెంటు పరిధిలోని ఏడు ఆసెంబ్లీ స్థానానలని కైవసం చేసుకుంది. ప్రతిపక్ష పార్టీలు గత అసెంబ్లీ ఎన్నికలలో గట్టి పోటి ఇవ్వలేక పోయాయి. కాంగ్రెస్ టికెట్ విషయంలో మొదట విభేదాలు ఉన్నప్పటికీ తరువాత సద్దుమణిగాయి. ఇప్పుడు లోక్‌సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తున్నారు.ఇక్కడ అత్యధికంగా సింగరేణి కార్మికులు ఉన్న కారణంగా వారి ఓట్లని రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి అన్ని పార్టీలు. వంశీకృష్ణ నాన్న, పెద్ద నాన్న ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. దాదాపుగా అసెంబ్లీ కేంద్రాలతో పాటు, మండల కేంద్రాలు మేజర్ గ్రామ పంచాయతీలలో సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ పైనా విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ సింగరేణి ప్రైవేటీకరణ చేసేందుకు ప్లాన్ చేశాయని కాంగ్రెస్ నేతలు బలంగా జనంలోకి తీసుకువెళు న్నారు. కార్మికుల ఓట్లకు గాలం వేసి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తున్నారు.అటు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఈయన గతంలో సింగరేణి కార్మికుడు కావడంతో సింగరేణి కార్మికుల ఓట్లు తమకే వస్తాయని ధీమాగా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొత్త ఉద్యోగాల కల్పన, కార్మికుల సమస్యలను పరిష్కరించమని ప్రస్తావిస్తున్నారు. తమ ఉద్యమం కారణంగానే సింగరేణి ప్రైవేటీకరణ కాలేదని సమావేశాలలో గుర్తు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలు అటకెక్కాయని, బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. రైతులకు ఇబ్బందులు వచ్చినా అటువైపు చూడని కాంగ్రెస్ కి గుణపాఠం తప్పదని కొప్పుల విపర్శిస్తున్నారు.బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పూర్తిగా మోదీ హావానే నమ్ముకున్నారు. అయన సామజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండడంతో గెలుపులో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. కుటుంబ పార్టీ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గుణపాఠం తప్పదని అంటున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు ఓటు వేసిన వృధా అని విమర్శలు చేస్తున్నారు. ఈ మూడు పార్టీల అభ్యర్థులు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు.

ఎన్నికల మేనిఫెస్టోపై మాయావతి కీలక వ్యాఖ్యలు

తమ రాజకీయ ప్రత్యర్థులు విడుదల చేసే ఆకట్టుకునే ఎన్నికల మేనిఫెస్టోలను చూసి పార్టీ శ్రేణులు కలవరపాటుకు గురవాల్సిన అవసరం లేదని బీఎస్పీ చీఫ్, యూపీ మాజీ సీఎం మాయావతి అన్నారు. ఏ ఎన్నికల్లోనూ తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయదని అన్నారు. కేవలం మాటలు చెప్పడం కంటే పని చేయడానే బీఎస్పీ విశ్వసిస్తుందని అన్నారు. యూపీలోని మొరదాబాద్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ మాయావతి ఈ వ్యాఖ్యలు చేశారు.ఇక కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పశ్చిమ ఉత్తరప్రదేశ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటిస్తామని అంతకుముందు మాయావతి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆదివారం ముజఫర్‌నగర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీ వేదికగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు అద్దం పడుతూ పశ్చిమ యూపీని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేస్తామని మాయావతి హామీ ఇచ్చారు.బీఎస్పీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలు, కార్మికులు, రైతులు, చిరు వ్యాపారుల అవసరాలను గుర్తించి సేవలు అందించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి చొరవ చూపుతుందని ఆమె పేర్కొన్నారు. మీరు కోరుకుంటే పశ్చిమ యూపీని ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటిస్తామని ఈ దిశగా తాము గట్టి చర్యలు చేపడతామని మాయావతి హామీ ఇచ్చారు. ఇక ముజఫర్‌నగర్ అభ్యర్థిగా దారా సింగ్ ప్రజాపతిని బీఎస్పీ ఎన్నికల బరిలో నిలిపింది.

ప్లాట్లను చేరువే కబ్జా చేసిందంటూ బాధితులు ధర్నా

అమీన్ పూర్,సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమీన్పూర్ పెద్ద చెరువు ప్లాట్లను ముంగేసిందంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 50 సర్వే నంబర్లలో 5000 మంది బాధితులు ప్లాట్లను కొనుగోలు చేశామని నేడు నీటితో నిండి తమ ప్లాట్లు కనిపించకుండా పోయాయని బాధితులు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 1985 సంవత్సరంలో ప్లాట్లను కొనుగోలు చేశామని అప్పుడు అమీన్పూర్ పెద్ద చెరువు 93.5 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని నేడు 460 ఎకరాలుగా ఎలా అయ్యిందంటూ ప్రశ్నించారు. ఎంతోమంది చెరువులను కబ్జా చేస్తుంటే మా ప్లాట్లను మాత్రం చెరువు కబ్జా చేసిందని తమకు న్యాయం ఎవరు చేస్తారని అన్నారు. నూతన ప్రభుత్వ ఏర్పడింది

మండిపోతున్న ఎండలు..

విద్యుత్ వినియోగం డిమాండ్

ముంబై, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్) వేసవిలో భానుడి వేడి మాత్రమే కాదు.. దాంతోపాటు విద్యుత్తు వినియోగం కూడా పెరుగుతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం వినియోగించే ఎయిర్ కండిషనర్లు మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో రావడంతో ఈ డిమాండ్ నానాటికీ పెరుగుతూ పోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే దక్షిణాది రాష్ట్రాల్లో ఎండ వేడి పెరిగిపోగా.. ఈ సీజన్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ సైతం హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విద్యుత్ డిమాండ్ కూడా ఆ మేరకు పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 'విద్యుత్ చట్టం ? 2003'లోని సెక్షన్ 11ను ప్రయోగించింది. ప్రత్యేక ? అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్తును ఉత్పత్తి చేసే సంస్థలను నియంత్రించే అధికారాన్ని ఈ సెక్షన్ కేంద్ర ప్రభుత్వానికి కట్టబెడుతోంది. ఆ మేరకు ఏ విద్యుత్తు సంస్థ తమ గరిష్ట సామర్థ్యానికి లోబడి ఎంత మొత్తంలో విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇప్పుడు దేశంలో పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రం సెక్షన్ 11ను ప్రయోగిస్తోంది.పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం కోసం గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 11 ప్రకారం అన్ని గ్యాస్ ఆధారిత పవర్ ప్లాంట్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు ఉపయోగంలో లేవు. డిమాండ్ పెరిగినప్పుడు మాత్రమే వీటి నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసి కొరత లేకుండా చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సెక్షన్ 11 ఉత్తర్వులు 2024 మే 1 నుంచి జూన్ 30 వరకు విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ అంశాల్లో అమల్లో ఉంటాయి. దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు సమానంగా గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయాలని నిర్ణయించింది. దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత విద్యుత్తు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రెండూ కూడా ఇతర విధానాల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తు కంటే ఖరీదు ఎక్కువ. కొరత ఏర్పడే పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వం ఈ రెండు రకాల విద్యుత్తును ఉత్పత్తి చేయించి వినియోగదారులకు అందుబాటులోకి తెస్తోంది.దేశీయ విద్యుత్తు అవసరాలు, ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు లెక్కలు వేసే గ్రిడ్-ఇండియా సంస్థ ఈ విషయంలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. సెక్షన్ 11 ప్రకారం గ్యాస్ బేస్డ్ పవర్ ప్లాంట్లు ఎంత మేర విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నది గ్రిడ్-ఇండియా నిర్ణయిస్తుంది. ఆ సంస్థ నుంచి వచ్చే ఆదేశాల మేరకు గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు విద్యుదుత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఈ విద్యుత్ ప్లాంట్లలో ఉత్పత్తయిన విద్యుత్తును పంపిణీ లైసెన్సులతో పాటు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లు కుదుర్చుకున్న సంస్థలు తీసుకుంటాయి. అదనపు విద్యుత్తును విద్యుత్ మార్కెట్లో అందుబాటులో ఉంచుతారు. తద్వారా ఒప్పందాలు కుదుర్చుకోని సంస్థలు సైతం గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తయిన విద్యుత్తును వినియోగించుకోగల్గుతాయి. వేసవి విద్యుత్ డిమాండ్ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ' చైర్మన్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కేవలం గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల ద్వారా మాత్రమే కాకుండా ఇతర ప్రత్యామ్నాయ చర్యల ద్వారా కూడా విద్యుత్ డిమాండ్‌ను తీర్చాలని ప్రభుత్వం నిర్ణయించి, కొన్న చర్యలు చేపట్టింది. వేసవిలో జరిగాల్సిన పవర్ ప్లాంట్ల మెయింటెన్సును వర్షాకాలానికి మార్చాలని, తద్వారా మెయింటెనెన్స్ సమయంలో నిలిచిపోయే విద్యుత్తు సమస్యను అధిగమించాలని నిర్ణయించింది. అలాగే ఇప్పటికే ఉన్న వివిధ రకాల విద్యుత్ ప్లాంట్లలో అదనపు సామర్థ్యాన్ని జోడించే పనులు వేగవంతం చేయడం ద్వారా కూడా అధిక డిమాండును అందుకోవచ్చని భావిస్తోంది. మరోవైపు థర్మల్ పవర్ ప్లాంట్లలో తలెత్తే పాక్షిక అంతరాయాలను తగ్గించడం ద్వారా నిరంతర సరఫరాకు వీలు కల్పిస్తోంది. క్యాప్టివ్ జనరేటింగ్ పవర్ స్టేషన్‌ల నుంచి మిగులు విద్యుత్‌ను ఉపయోగించాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే పవర్ ఎక్స్‌చేంజ్‌లో మిగులు విద్యుత్తును అమ్మకానికి అందుబాటులో ఉంచడం ద్వారా అవసరమైన రాష్ట్రాలు, విద్యుత్ పంపిణీ సంస్థలు తమ అవసరాల మేరకు కొనుగోలు చేయడానికి వీలుంటుంది. మరోవైపు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తిని అందించడానికి దిగుమతి చేసుకున్న బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లపై సెక్షన్ 11 అమలు చేస్తోంది. జల విద్యుత్ ఉత్పత్తిని పీక్ అవర్స్‌కి మార్చడం, బొగ్గు లభ్యతను నిర్ధారించడానికి సంబంధిత సంస్థలతో ఎప్పటికప్పుడు చర్చలు జరపడం వంటివి కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగమే.పెరుగుతున్న జనాభా, పెరుగుతున్న అవసరాలకు తగ్గట్టు ప్రతి ఏటా విద్యుత్ అవసరాలు పెరగడం సహజమే అయినప్పటికీ.. భారత్ ఆర్థిక వృద్ధి కూడా విద్యుత్ డిమాండ్‌ను ఒక్కసారిగా పెంచేసింది. దేశాభివృద్ధితో పాటు విద్యుత్ గృహోపకరణాల అమ్మకాలు, వినియోగం కూడా నానాటికీ పెరుగుతూ పోతోంది. వేసవి కాలంలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరుగుతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్తు ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది

కాంగ్రెస్ ను గెలిపించాలి

ఖమ్మం, ఏప్రిల్ 15, (న్యూస్ పల్స్)ఖమ్మం జిల్లా వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. పొంగులేటి మాట్లాడుతూ మే 13 జరగబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు స్థానాలకు ఎంపీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఓటీసి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సీట్లు కాంగ్రెస్ పార్టీని కైవసం చేసుకుంటుం దన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రాణాలు అర్పించిన సంగతి తెలుసని అన్నారు.రాజీవ్ గాంధీ చనిపోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో సోనియా గాంధీ ఇద్దరు బిడ్డలను సంకనేసుకుని భారత దేశ ప్రజల కోసం ప్రతి రాష్ట్రాన్ని ప్రతి నియోజకవర్గాన్ని తిరిగి భారత దేశంలో కాంగ్రెస్ పార్టీని ప్రజలలో మమేకం చేసి కాంగ్రెస్ పార్టీని కాపాడిన సంగతి మీకు తెలుసు. ఈ రోజు రాహుల్ గాంధీ ప్రధానమంత్రిని చేయాలి అనుకుంటే 20 సంవత్సరాల క్రితం రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేవారు.ప్రధానమంత్రి స్థానాన్ని సున్నితంగా తిరస్కరించి దేశ ప్రజల కోసం ఆనాడు కాంగ్రెస్ పార్టీలో ఉంది రాహుల్ గాంధీ ప్రధానమంత్రి ఇచ్చిన గొప్ప సంస్కృతి నీతి ఉన్న కుటుంబం సోనియా గాంధీ కుటుంబం. రాముని విగ్రహాలతో అయోధ్య అక్షింతలు పేరు చెప్పుకొని రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం మొన్నటిదాకా పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వము కూడా మనకి తెలియంది కాదు. కుల చిచ్చులు అన్నదమ్ములు భార్యాభర్తల మధ్య పంచాయతీలు పెట్టి రెండు పర్యాయాలు దేశానికి ప్రధానమంత్రి అయిన సంగతి కూడా మనకి తెలియంది కాదు. దేశ ప్రజలకి చేసిన హామీలు ఏరకంగా భారతదేశ ప్రజలకు ఇచ్చిన ప్రభుత్వంలో పరిపాలించిన పెద్దల సంగతి కూడా మనకు తెలియంది కాదు. ఈ దేశానికి ప్రధానమంత్రిని చేసే అవకాశం రాహుల్ గాంధీ గాని ప్రధానమంత్రి చేసిన అవకాశం వచ్చింది ఈ అవకాశాన్ని మనందరం ప్రధానమంత్రిని చేసే దాంట్లో భాగంగా పార్లమెంటుని అభ్యర్థి ఎవరైనా అభ్యర్థి ఎవరికి ఇచ్చినా కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద అత్యధిక ఓట్లు వేసి మంచి మెజార్టీతో ఈ దేశ ప్రధానమం త్రిగా రాహుల్ గాంధీ గారిని చేసే దాంట్లో పార్లమెంటు సభ్యుడు కూడా ఓటు వేసే విధంగా మీరందరూ కష్టపడి మంచి మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుకుంటున్నాను. మొన్న మీరు అందరూ కష్టపడ్డారు. ఇచ్చిన హామీలను ఏవైతే ఆరు గ్యారెంటీ ఐదింటిని అమలు చేశామని అన్నారు.

ఫోన్ ట్యాపింగ్...

ప్రభాకరరావుకు ప్రాణహానీ...

హైదరాబాద్, ఏప్రిల్ 15, ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్టులు చూస్తుంటే గనక, సినిమా తీస్తే రికార్డుల మోత మోగడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు చుట్టూ కథంతా నడుస్తున్నా, ఆయన అమెరికా, దుబాయ్ అంటూ చక్కర్లు కొడుతున్నారు. హైదరాబాద్ వస్తారా? వస్తే ఏం జరుగుతుంది? ఇలా అనేక డౌట్స్ నడుమ తాజాగా ఆసక్తికర చర్చ ఒకటి జరుగుతోంది.అన్నిటికీ సెంట్రల్ పాయింట్‌గా మారిన ప్రభాకర్ రావు నగరానికి వచ్చేది లేనిదీ తెలియడం లేదు. కానీ, ఆయనపై అనేక ఒత్తిళ్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. విచారణకు హాజరుకావాలా వద్దా? అంటూ ఆనాడు అధికారంలో పెత్తనం చెలాయించిన వారు రెండు వర్గాలుగా విడిపోయారు. ఇటీవల ఓ వర్గం దుబాయ్‌కి వెళ్లి సంప్రదింపులు జరిపినట్లు చర్చ జరుగుతోంది. అప్పటి ప్రభుత్వ సుప్రీం చెప్పినట్లు దేశానికి రావాల్సిన అవసరం లేదని తెల్చి చెప్పారట. ఎంత ఖర్చైనా తామే బరిస్తామని చెప్పారట. దీంతో దుబాయ్ నుంచి ప్రభాకర్ రావు ఎక్కడికి వెళ్లారనే సస్పెన్స్ కొనసాగుతోంది. మరోవైపు అరెస్ట్ అయిన ఆఫీసర్స్ ప్రభాకర్ రావు వస్తేనే తమపై ఒత్తిడి తగ్గుతుందని కుటుంబసభ్యులకు సమాచారం చేరవేస్తున్నారు. బెయిల్ రావాలంటే ప్రభాకర్ రావు పోలీసులకు సహకరించాలని కోరుతున్నారు. ఆయనను విచారించకుంటే తమకు ఇప్పట్లో బెయిల్ రాదని, ఎలాగైనా వచ్చేలా చేయాలని తెలిసిన పెద్దలతో పైరవీలు జరుపుతున్నారు. ఆయన వస్తేనే బెటర్ అనే ఫీలింగ్‌ను ప్రభాకర్ రావు ఫ్యామిలీకి కల్పిస్తున్నారు. డ్యూటీలో భాగంగా చేసినందన తొందరగానే బెయిల్ వస్తుందని మచ్చిక చేసుకుంటున్నారు.ప్రభాకర్ రావు 15 ఏండ్లుగా క్యాన్సర్‌తో సఫర్ అవుతున్నారు. నేరం చేయకముందే రోగం ఉందని తెలుసు. అంతా తెలిసే చేశారు. కానీ, ఇప్పుడు బెయిల్ పిటిషన్ కోసం తన ఆరోగ్యం సహకరించడం లేదని, ముందస్తు బెయిల్ ఇస్తే పోలీసులకు సహకరించేందుకు ప్రిపరేషన్స్ చేసుకుంటున్నట్టు సమాచారం. సుప్రీం అనుచరులు రావొద్దని చెప్పడంతో ఎలా ముందుకు వెళ్లాలో కొద్ది రోజులు వేచి చూడాలని ప్రభాకర్ రావు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.హైదరాబాద్ సీపీ కేసు విచారణలో సాక్ష్యాధారాలతో ముందుకు వెళ్తున్నారు. మాజీ మంత్రులైన దయాకర్ రావు, హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్‌ల పేర్లు ట్యాపింగ్ కేసులో వినిపిస్తున్నాయి.

వేసవి ప్రయాణికులతో రైళ్లు రద్దీ

మరో 15 ప్రత్యేక రైళ్లను ప్రకటించిన రైల్వే శాఖ

హైదరాబాద్,ఏప్రిల్15: వేసవి ప్రయాణికులతో రైళ్లు రద్దీగా మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ట్రైన్‌లో వెళ్లడమంటే సాహసమే అని చెప్పాలి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయించింది. ఏకంగా 15 రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. రైల్వే ప్రయాణీకులు తాకిడి నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రయాణీకుల సంఖ్యకు అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచారు. 15 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. వేసవిలో పెరుగుతున్న ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక రైళ్లు మే ఒకటో తేదీ నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు షెడ్యూల్ వారీగా రాకపోకలు కొనసాగిస్తాయని అధికారులు తెలిపారు. పాట్నా – సికింద్రాబాద్, హైదరాబాద్ – పాట్నా, దనపూర్ – సికింద్రాబాద్, దనపూర్ – బెంగుళూరు వంటి స్టేషన్ల మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. రైళ్లు, రిజర్వేషన్ వివరాలకు ఎస్‌సీఆర్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు అదనంగా ఏర్పాటు చేస్తున్న రైళ్ల వల్ల ప్రయాణీకులకు ఎంతో మేలు కలుగనుంది. వేసవి సెలవులు నేపథ్యంలో అనేక ప్రాంతాలకు, టూర్లకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. అందుకు అనుగుణంగా రైళ్లు లేకపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణీకుల ఇబ్బందులను గుర్తించిన దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. అదనంగా 15 రైళ్లను నడపాలని నిర్ణయించడం వల్ల వేలాది మంది ప్రయాణీకులు సాఫీగా ప్రయాణం సాగించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రతిరోజూ వందలాది మంది ఆయా ప్రాంతాలు గుండా ప్రయాణాలు సాగించడానికి అనువుగా ఈ నిర్ణయం దోహదం చేస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు.

మద్దతు ధరలకు అనుగుణంగా కొనుగోళ్లు

ఖమ్మం,ఏప్రిల్15: గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ధాన్యం దిగుబడి తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ధాన్యం మద్దతు ధర కూడా పెరిగినందున రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే విక్రయాలు జరిపే అవకాశాలు ఉన్నాయి. దళారుల ప్రమేయం లేకుండా రైతులకు అన్ని సౌర్యాలు కల్పించారు. ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ములను జమ చేశారు. రైతు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతుధర ఇచ్చిన కొనుగోలు చేస్తోంది. అంచనాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతులకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జీసీసీ,ఐకేపీ, కోపరేటివ్ సొసైటీల ద్వారా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా అం దుబాటులోకి గన్నీ బ్యాగ్‌లను కూడా ఉంచారు. రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన ధాన్యానికి వెంటనే పేమెంట్లు చేసేవిధంగా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అన్నారు.

రైతు సంక్షేమమే రేవంత్ లక్ష్యం

జనగామ,ఏప్రిల్15 రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎంరేవంత్ రెడ్డి పని చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. రైతుల సంక్షేమం విషయంలో రాజీ పడలేదన్నారు. 24గంటల కరెంట్, పెట్టుబడి, బీమా అన్నవి దేశంలో ఎక్కడా లేవన్నారు. మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, అవినీతిపైనా కఠిన చర్యలకు ఉపక్రమించారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బంది రాకుండా ఆదేశించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో గుర్తించి ఆదరించారని వెల్లడించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత విద్యుత్‌ను రైతులకు అందిస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నదిని అన్నారు. రేవంత్ పాలనపై ప్రజల్లో మరింత భరోసా పెరిగిందని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఇప్పుడు ప్రజల అభివృద్ధే ముఖ్యమని రేవంత్ నిరూపించారని అన్నారు. అవినీతికి తావు లేకుండా మద్దతు ధరలకు ధాన్యం కొనుగోళ్లను చేస్తామని చెప్పడంతో రైతులకు భరోసా దక్కిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేయడంలో ముందుంటామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కారానికి కృషి చేయడాన్ని అభినందించారు.

సమస్యలకు భగవద్గీతతో సమాధానం (ఆధ్యాత్మికం)

తిరుమల,ఏప్రిల్15 : కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకి సందిగ్ధతకి సమాధానంగా భగవద్గీత ఈ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది, ఏ నాటికీ ప్రమాణంగా నిలుస్తుంది. ఏ పని ఎట్లా చేయాలి, ఎంత వరకు చేయాలి అనే సంశయం కలిగిన వ్యక్తికి ఒక శ్రేయ సాధనంగా భగవద్గీత ఉపయోగపడుతుంది. నాకు కర్తవ్యం ఏమితే తెలియట్లేదు కానీ, 'ఏ శ్రేయస్యం నిశ్చితం భూహితన్మే' నేను శ్రేయస్సుని కోరుకుంటున్నాను, నాకేది శ్రేయస్సో అది చెప్పు అని అర్జునుడు అడిగినది. శ్రేయస్సుని పొందాలి అనుకున్నవాడికే ఏమైనా చెప్పడం అవసరం, ఆ శ్రేయస్సు కోరే వ్యక్తి ఏ స్తాయిలో ఉన్నా అందరికి అందేలా శ్రీకృష్ణ భగవానుడు అందించిన ఉపదేశమే భగవద్గీత. అది వ్యక్తి గతంగా చిన్న స్థాయిలో కావచ్చు, యువ స్థాయిలో కావచ్చు, ఒక గృహస్తుగా జీవించే వ్యక్తి స్థాయిలో కావచ్చు, లేక వ్యాపారమో, వాణిజ్యమో, ఔద్యోగికమో ఏదో రకమైన శ్రేయస్సుని పొందాలి, అది ఆత్మోజ్జీవనక

సినిమా తీరు

సేఫ్ సైడ్ ఉండేలా కన్నప్ప ప్లాన్..!

రిస్క్ చేస్తేనే కానీ కెరీర్ కొనసాగించే ఛాన్స్ లేదని తెలిసి స్టార్స్ అంతా కూడా ఒళ్లు హూనమయ్యేలా కష్టపడుతున్నారు. సినిమా సినిమాకు వారి రేంజ్ పెంచుకుంటూ తెలుగు సినిమా అంటే పాన్ ఇండియా లెవెల్ లో ప్రభంజనం సృష్టించే స్థాయికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో మంచు ఫ్యామిలీ హీరో మంచు విష్ణు కెరీర్ లో భారీ రిస్క్ చేస్తున్నాడు. అతను లీడ్ రోల్ లో కన్నప్ప అంటూ క్రేజీ సినిమా చేస్తున్నాడు. ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్షన్ లో కన్నప్ప అంటూ ఒక గొప్ప అటెంప్ట్ చేస్తున్నాడు విష్ణు. సల్మాన్ ఇంటి వద్ద పోలీసు వాహనం మిస్సింగ్... గ్యాంగ్ స్టర్ తమ్ముడి పోస్ట్ వైరల్! తన కెరీర్ లోనే బిగ్ బడ్జెట్ సినిమాగా కన్నప్పను తీస్తున్న మంచు విష్ణు ఈ సినిమాతో కెరీర్ ని మరోసారి సెట్ రైట్ చేసుకోవాలని ఫిక్స్ అయ్యాడు. సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, మోహన్ బాబు లాంటి స్టార్స్ నటిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో చేస్తున్న కన్నప్ప ప్లానింగ్ విషయంలో కూడా మంచు విష్ణు పర్ఫెక్ట్ స్కెచ్ వేసినట్టు తెలుస్తుంది. ఇక ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంటుండగా రిలీజ్ పై క్లారిటీ రావాల్సి ఉంది.ఆ భామతో మనోడి లుక్ వైరల్ మంచు విష్ణు కన్నప్ప సినిమాను అక్టోబర్ లో దసరా బరిలో దించుతారన్న టాక్ ఉంది. అయితే దసరాకి దేవర ఆల్రెడీ ఖర్చీఫ్ వేశాడు. అసలే ఫ్యాన్స్ అందరికీ కాలర్ ఎగరేసే సినిమా అంటూ దేవరపై స్వయంగా తారక్ అంచనాలు పెంచేస్తున్నాడు. ఇదే కాకుండా సూపర్ స్టార్ రజినికాంత్ వేట్టయాన్ సినిమా కూడా దసరాకి టార్గెట్ చేస్తున్నారు. ఈ రెండు సినిమాల మధ్య కన్నప్ప వస్తే కచ్చితంగా బాక్సాఫీస్ దగ్గర టఫ్ ఫైట్ జరుగుతుంది. మంచు విష్ణుకి ప్రస్తుతం అంత గొప్ప మార్కెట్ లేదు. రెండేళ్ల క్రితం జిన్నా సినిమాతో వచ్చిన విష్ణుని ఎవరు పట్టించుకోలేదు. ఇప్పుడు కన్నప్ప అంటూ ఒక గొప్ప ప్రయత్నాన్ని మొదలు పెట్టాడు. ఈ సినిమా విపరీతమైన పోటీ మధ్యలో రిలీజ్ చేస్తే కచ్చితంగా సినిమాపై ఎఫెక్ట్ పడుతుంది. అందుకే దసరాని స్కిప్ చేసి సోలో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారట. ప్రస్తుతం మంచు హీరోకి ఉన్న మార్కెట్ దృష్ట్యా అలా అయితేనే కన్నప్ప కాస్త సేఫ్ సైడ్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. అయితే ఈమధ్య టీజర్, ట్రైలర్ తో హైప్ వస్తే చాలు అందులో నటించింది ఎవరన్నది చూడకుండా సినిమాపై బజ్ పెంచెస్తున్నారు ఆడియన్స్. సో కన్నప్ప ను కూడా టీజర్ తోనే హైప్ తెచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. త్వరలోనే సినిమా నుంచి ఒక టీజర్ రాబోతుందని టాక్. దసరా మిస్ అయితే కన్నప్ప డిసెంబర్ కి వెళ్లే ఛాన్స్ ఉంటుంది. మరి కన్నప్పగా మంచు విష్ణు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతవరకు వర్క్ అవుట్ అవుతుందో చూడాలి.

ఆ స్టార్ హీరో పాన్ ఇండియా రిలీజ్ లాక్ అయినట్లేనా?

కోలీవుడ్ స్టార్ సూర్య కథానాయకుడిగా శివ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య పిరియాడిక్ థ్రిల్లర్ 'కంగువ' తెర కెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో అంచనాలు ఆకాశన్నంటుతున్నాయి. పిరియాడిక్ థ్రిల్లర్ కి టైమ్ ట్రావెల్ నేపథ్యాన్ని జోడించడంతో? ఈ కాంబో కొత్తగా ఏదో చెప్పబోతున్నారు? అన్న ఎగ్జైట్ మెంట్ అభిమానుల్లో అంతకంతకు రెట్టింపు అవుతుంది. కానీ చిత్ర యూనిట్ మాత్రం 'కంగువ' రిలీజ్ ఎప్పుడు? అన్నది క్లారిటీ ఇవ్వడం లేదు. ఇప్పటికే అక్టోబర్ -డిసెంబర్ నెలల్లోనే రిలీజ్ అయ్యే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.అక్టోబర్ లో మరికొన్ని పాన్ ఇండియా సినిమాలు రిలీజ్ కి రెడీ గా ఉన్నాయి. అక్టోబర్ లో 'దేవర' వస్తే! సూర్య కచ్చితంగా వెనక్కి తగ్గాల్సిందే. దాంతో పాటు 'గేమ్ ఛేంజర్' కూడా అదే నెలలో రిలీజ్ అవకాశాలున్నాయి. కాబట్టి సూర్య తెలుగు మార్కెట్ ని దృష్టి లో పెట్టుకుని అక్టోబర్ అతి కష్టం అని చెప్పొచ్చు. ఆ తర్వాత ఆప్షన్ లో ఉంది డిసెంబర్. ఇక్కడైతే కాస్త సేఫ్ గానే రిలీజ్ చేసుకోవచ్చు. ఆనెలలో పెద్దగా సినిమాలేవి రిలీజ్ లేవు. అటుపై వచ్చేది సంక్రాంతి మాసం కాబట్టి సౌత్ హీరోలంతా జనవరిని టార్గెట్ చేస్తారు. మరి సూర్య ఆ ఛాన్స్ తీసుకోవచ్చు! కదా? అంటే అక్కడో చిక్కుంది. ఈ సినిమా నిర్మాణంలో తెలుగు నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ భాగస్వామిగా ఉంది. ఇదే సంస్థ తెలుగులో చిరంజీవితో కూడా 'విశ్వంభర' నిర్మిస్తుంది. ఆ సినిమా ఇప్పటికే సంక్రాంతి డేట్ లాక్ చేసుకుంది. కాబట్టి 'కంగువ' కి సంక్రాంతి ఛాయిస్ లేదిక్కడ. ఆ తర్వాత రిలీజ్ చేద్దామనుకుంటే బాగా డిలే అవుతుంది. కాబట్టి సూర్య ముందు కేవలం డిసెంబర్ ఒక్కటే కనిపిస్తుంది. రిలీజ్ చేస్తే 2024 ముగింపు మాసంలో రిలీజ్ చేయాలి. లేదంటే పోటీకి సై అంటూ అక్టోబర్ లో రంగంలోకి దిగాల్సిందే. మరి స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ ప్లానింగ్ ఎలా ఉంది? అన్నది తెలియాలి. ప్రస్తుతం కంగువ షూటింగ్ దశలో ఉంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఏకకాలంలో జరుగుతున్నాయి.



అందానికే మరో అందం....

వార్ 2 లీక్స్.. ఆ భామతో మనోడి లుక్ వైరల్

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ లీడ్ రోల్స్ లో యాక్ట్ చేస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ వార్-2. ఈ సినిమాతో బాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నారు తారక్. ఇటీవల ఈ మూవీ షూట్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ముంబై చేరుకున్నారు. ఆ సమయంలో తన హెయిర్ స్టైల్ ను కవర్ చేస్తూ టోపీ పెట్టుకున్న విజువల్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. ఈ సినిమాలో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కాంబోలో మాస్ సాంగ్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. హృతిక్, తారక్ సూపర్ స్టైలిష్ డ్యాన్సర్లని అందరికీ తెలిసిందే. వీరిద్దరి కాంబోలో వరల్డ్ క్లాస్ మెస్మరైజింగ్ సాంగ్ ను మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఆ పాట నెక్స్ట్ లెవెల్ లో ఉంటుందని సినీ వర్గాల్లో టాక్. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్ తో రూపొందిస్తోంది. ప్రస్తుతం యశ్ రాజ్ ఫిల్మ్స్ స్టూడియోలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ పై కీలక యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు మేకర్స్. 10 రోజుల పాటు ఈ కీలక షెడ్యూల్ జరగనుంది. ఈ మూవీలోని పాత్ర కోసం ఎన్టీఆర్ ఇంటర్నేషనల్ ఫిట్నెస్ ఎక్స్పర్ట్ తో రెండు వారాలపాటు ట్రైనింగ్ సెషన్ లో పాల్గొన్నారని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ముంబై షెడ్యూల్ తర్వాత హైదరాబాద్ చేరుకుని దేవర షూటింగ్ లో పాల్గొనున్నారు తారక్. మరోవైపు, బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలా.. జూనియర్ ఎన్టీఆర్ తో దిగిన సెల్ఫీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. జిమ్ లో వీరిద్దరు దిగిన సెల్ఫీ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. పిక్ ను పోస్ట్ చేస్తూ ఊర్వశి ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చింది. తారక్ పై ప్రశంసల వర్షం కురిపించింది. "జూనియర్ ఎన్టీఆర్ మా ప్రియమైన నిజమైన గ్లోబల్ సూపర్ స్టార్.. క్రమశిక్షణ, నిజాయితీ, వినయంతో మీ వ్యక్తిత్వం నిజంగా ప్రశంసనీయం. భవిష్యత్తులో మీతో కలిసి పని చేయడానికి రెడీ" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఊర్వశి రౌతేలా.. తెలుగులో సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ ఔఐ 109లో యాక్ట్ చేస్తోంది. ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. దసరా కానుకగా ఈ మూవీ విడుదలయ్యే అవకాశం ఉంది. అయితే వార్-2లో ఊర్వశి కూడా నటిస్తుందా అని ప్రశ్నిస్తున్నారు నెటిజన్లు. మొత్తానికి పిక్ అదిరిపోయిందని, థాంక్స్ మేడమ్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఇండియన్ 2 శంకర్ సెంటిమెంట్ మారట్లే..

ఇండియాలో కమర్షియల్ డైరెక్టర్ గా టాప్ చైర్ లో ప్రస్తుతం రాజమౌళి పేరు గట్టిగా వినిపిస్తోంది. కానీ ఒకప్పుడు శంకర్ పేరు చెప్పేవారు. సోషల్ ఎలిమెంట్ ని కమర్షియల్ అంశాలు జోడించి స్టార్ హీరోలతో సినిమాలు చేసి శంకర్ సక్సెస్ అయ్యారు. అతని ప్రతి సినిమా తమిళంతో పాటు ఇతర భాషలలో కూడా రిలీజ్ అయ్యి సూపర్ హిట్ అయ్యేవి. ముఖ్యంగా శంకర్ సినిమాలు అన్ని తమిళ్, తెలుగు భాషలలో రిలీజ్ అయ్యేవి. తమిళం తరహాలోనే తెలుగులో కూడా శంకర్ సినిమాలకి విశేషమైన ఆదరణ లభించింది. ఆయన సినిమాలలో కమల్ హాసన్ తో 1996లో చేసిన ఇండియన్ మూవీ సెన్సేషనల్ హిట్ అయ్యింది. దానిని తెలుగులో భారతీయుడు టైటిల్ తో రిలీజ్ చేస్తే ఇక్కడ కూడా సూపర్ హిట్ అయ్యింది. హిందీలో హిందుస్తానీ అనే టైటిల్ తో రిలీజ్ చేసి సక్సెస్ అందుకున్నారు. ఆ సినిమాతోనే డిస్ట్రిబ్యూటర్ గా దిల్ రాజు రేంజ్ పెరిగింది. గతంలో ఇతర భాషలలో తెరకెక్కే సినిమాలు ఏవైనా డబ్బింగ్ చేసేటపుడు ఆయా భాషలకి తగ్గట్లు పేర్లు పెట్టేవారు. హిందీ సినిమాలు తెలుగులో డబ్బింగ్ అయ్యి హిట్ అందుకున్నవి ఉన్నాయి. వాటికి తెలుగు పేర్లే పెట్టారు. అలాగే తమిళ సినిమాలని తెలుగులో రీజనల్ టైటిల్స్ తోనే రిలీజ్ చేశారు. అయితే బాహుబలి తర్వాత ట్రెండ్ మారింది. పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ అవుతోన్న అన్ని సినిమాలకి ఒకే టైటిల్ ని పెడుతున్నారు. అన్ని భాషలకి కనెక్ట్ అయ్యే విధంగా కామన్ టైటిల్స్ ని ఎంచుకుంటున్నారు. కానీ డైరెక్టర్ శంకర్ మాత్రం ప్రస్తుతం కమల్ హాసన్ తో చేస్తోన్న ఇండియన్ మూవీ సీక్వెల్ విషయంలో తన పాత పద్ధతిని ఫాలో అవుతున్నారు. ఈ సినిమాకి తమిళంలో ఇండియన్ 2, తెలుగులో భారతీయుడు 2, హిందీలో హిందుస్తానీ 2 అనే పేర్లు ఖరారు చేస్తూ తాజాగా పోస్టర్స్ రిలీజ్ చేశారు. ఈ పద్ధతిలోనే గతంలో ఇండియన్ మూవీ వచ్చి సక్సెస్ అయ్యింది. ఈ కారణంగా ఆయా భాషల ఆడియన్స్ కి ఏ టైటిల్స్ అయితే రీచ్ అయ్యాయో అదే టైటిల్స్ సీక్వెల్స్ కి కూడా ఉంటే ఎక్కువ రీచ్ ఉంటుందని శంకర్ తన ఓల్డ్ ఫార్మాట్ ని ఫాలో అయ్యినట్లు తెలుస్తోంది. ఇండియన్ మూవీ సీక్వెల్ 28 ఏళ్ళ తర్వాత రాబోతోంది కాబట్టి పాత పద్ధతిలోనే టైటిల్ ఉండటం బెటర్ అనే మాట కూడా వినిపిస్తోంది. మరి ఈ పద్ధతిలో ఇండియన్ మూవీ సీక్వెల్ తో శంకర్ ఏ రేంజ్ సక్సెస్ అందుకుంటాడు అనేది వేచి చూడాలి.

రుచికి రుచి. అందానికి అందం.. మామిడితో చర్మ సౌందర్యం రెట్టింపు..

వేసవి అంటే ముందుగా గుర్తొచ్చేది మామిడి పండు. ఎండలు మండుతాయని తెలిసినా.. సమ్మర్ రావాలని కోరుకునేది ఈ పండు గురించే. కింగ్ ఆఫ్ ఫ్రూట్స్గా పిలచుకునే ఈ పండు రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే. రకరకాల పేర్లతో లభించే ఈ పండును తింటుంటే ప్రపంచాన్నే మైమరిచిపోతుంటాం. ఇందులో ఉండే విటమిన్స్, పోషక విలువలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే మామిడి కేవలం రుచి, ఆరోగ్యానికే కాకుండా ముఖారవిందానికి కూడా ఉపయోగపడుతుందని మీకు తెలుసా? చర్మసౌందర్యాన్ని రెట్టింపు చేసే మామిడితో ఎలాంటి లాభాలు ఉన్నాయో ఓ సారి చూద్దాం..

× ఒక చెంచా మామిడి పండు గుజ్జులో అర చెంచా పాలతో పాటు తేనె కలిపి ముఖానికి అప్లై చేసి బాగా స్క్రబ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై ఉన్న బ్లాక్ హెడ్స్ తొలిగిపోతాయి. అంతేకాకుండా డెడ్ స్కిన్ తొలిగిపోవడంతో ముఖం కాంతివంతంగా మారుతుంది. కొద్దిగా గోధుమ పిండిలో ఒక చెంచాడు మామిడి గుజ్జును తీసుకొని బాగా మిక్స్ చేయాలి. అనంతరం ఈ పేస్ట్ను ముఖానికి అప్లై చేసుకోవాలి.. ఇది మంచి యాస్ట్రిజెంట్గా ఉపయోగపడి.. చర్మ గ్రంధులు తెరుచుకునేలా చేస్తుంది. మామిడిలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు చర్మాన్ని ఎప్పుడూ తేమగా ఉండేలా చేస్తుంది. ఇందులోని పొటాషియం, విటమిన్ ఈ చర్మాన్ని ఎండిపోకుండా చూసుకుంటుంది. మీరు ఆయిల్ స్కిన్తో బాధపడుతున్నారా.? ముఖం ఎప్పుడూ జిడ్డుగా ఉంటుందా.? అయితే మామిడిని బ్రై చేయాల్సిందే. ఇందులో ఉండే మెగ్నీషియం ఆయిల్ స్కిన్ను చెక్ పెడుతుంది. మామిడిలో ఉండే విటమిన్ ఏ కారణంగా చర్మంపై ఉండే నల్లటి మచ్చలు తొలిగిపోతాయి.

స్వీట్ మెమోరీస్.. అద్భుతాలను నెమరువేసుకున్న ధోని

భారత క్రికెట్కు సంబంధించి మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని పరిచయం అక్కర్లేని పేరు. ఈ మిస్టర్ కూల్ కెప్టెన్ తన కెరీర్లో సాధించిన ఘనతల ద్వారా భారత్లోనే కాకుండా విశ్వవ్యాప్తంగా అభిమానులను సంపాధించుకున్నాడు.ధోని ఎక్కడికి వెళ్లినా అభిమానులు నీరాజనాలు పలుకుతారు. ధోని అంతర్జాతీయ క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించి దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ క్రేజ్ తగ్గడం? లేదు.ఆటగాడిగానే కాకుండా వ్యక్తిగతంగానూ ధోనిని అభిమానించే వారు చాలామంది ఉన్నారు. ధోనిని స్టయిల్ ఐకాన్గా ఆరాధించే వారు కోకొల్లలు. ధోని తాజా లుక్కు సెపరేట్ ఫ్యాన్ బేసే ఉంది. కెరీర్ ఆరంభంలో ధోని ఆహార్యం ఎలా ఉండిందో ప్రస్తుతం అలాగే ఉంది. జులపాల జట్టుతో ధోని సినిమా హీరోలను తలదన్నేలా ఉన్నాడు. 42 ఏళ్ల వయసులోనూ 24 ఏళ్ల యువకుడిలా కనిపిస్తున్నాడు. ధోనికి వయసు మీద పడుతున్నా వన్నె తగ్గడం లేదని అభిమానులు అనుకుంటారు.అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్న తర్వాత ఐపీఎల్కు, సినిమాలకు మాత్రమే పరిమితమైన ధోని.. నిన్న (ఏప్రిల్ 14) ముంబై ఇండియన్స్తో మ్యాచ్ ఆడేందుకు ముంబైకి వచ్చాడు. ఈ సందర్భంగా బీసీసీఐ హెడ్ క్వార్టర్స్కు సందర్శించిన ధోని.. భారత క్రికెట్ తరఫున తాను సాధించిన అద్భుతాలను నెమరువేసుకున్నాడు. బీసీసీఐ ఆఫీస్లో తాను సాధించిన ఘనతలను తలచుకుంటూ మురిసిపోయాడు.తన సారథ్యంలో టీమిండియా సాధించిన టీ20 వరల్డ్కప్ (2007), వన్డే వరల్డ్కప్ (2011) ట్రోఫీలను స్పర్శించి పరవశించిపోయాడు. టీమిండియా జెర్సీని చూసుకుని మురిసిపోయాడు. వన్డే వరల్డ్కప్లో తానాడిన విన్నింగ్ షాట్ ఫోటోగ్రాఫ్పై ఆటోగ్రాఫ్ చేసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాడు. ధోని బీసీసీఐ ఆఫీస్లో గడిపిన క్షణాలకు సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతుంది.నిన్నటి మ్యాచ్లో ధోని మెరుపు ఇన్నింగ్స్ అనంతరం ఈ వీడియో ట్రెండింగ్లోకి వచ్చింది. ముంబైతో మ్యాచ్లో చివరి ఓవర్లో బ్యాటింగ్కు దిగిన ధోని ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. హార్దిక్ వేసిన ఆ ఓవర్లో అతను హ్యాట్రిక్ సిక్సర్లు సహా 20 పరుగులు చేసి పాత ధోనిని గుర్తు చేశాడు. ఈ మ్యాచ్లో ధోని ఆడిన మెరుపు ఇన్నింగ్స్తే ముంబై, సీఎస్కే స్కోర్ల మధ్య వ్యత్యాసంగా నిలిచింది.ఈ మ్యాచ్లో ముంబై ఓపెనర్ రోహిత్ శర్మ సెంచరీతో కదంతొక్కినప్పటికీ సీఎస్కే 20 పరుగుల తేడాతో గెలుపొందింది. కెరీర్ చరమాంకంలో (ఐపీఎల్) ఉన్న ధోని పాత రోజులను గుర్తు చేయడంతో అతని అభిమానులు తెగ సంబురపడిపోతున్నారు. ధోని ఇదే ఫామ్ను కొనసాగిస్తే.. ఈ సీజన్లోనూ సీఎస్కేదే టైటిల్ అని చెప్పుకుంటున్నారు. ధోని ఇటీవలే సీఎస్కే సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ధోని స్వచ్ఛందంగా సీఎస్కే కెప్టెన్సీ నుంచి వైదొలిగి రుతురాజ్కు బాధ్యతలు అప్పజెప్పాడు. ఈ సీజన్లో సీఎస్కే 6 మ్యాచ్ల్లో 4 విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతుంది.

రామాఫలం.. ఆరోగ్యానికి శ్రీరామరక్ష

సీతాఫలం గురించి అందరికీ తెలుసు. రామాఫలం గురించి కొందరికే తెలుసు. అరుదుగా లభించే ఈ పండులో పోషక విలువలు మెండు. శరీరానికి కావాల్సిన కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్, కొవ్వు, ప్రొటీన్, విటమిన్ బి1,బి2,బి3,బి5,బి6, విటమిన్ సి, క్యాల్షియం, ఐరన్, పొటాషియం, సోడియం ఇలా ఎన్నో పోషకాలు ఇందులో సమృద్ధిగా ఉంటాయి. సీతాఫలం తీపి ఫలమైతే రామాఫలంలో తియ్యదనం తక్కువ. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ పండును నిరభ్యంతరంగా తినొచ్చు. ఇందులోని పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిని నియంత్రిస్తాయి కూడా. రామాఫలంలోని విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ సి ముఖంపై మొటిమలను నివారిస్తాయి. శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్ను బయటకు పంపటంలో ఇది ఉత్తమంగా పనిచేస్తుంది. అంతేకాదు, ఈ పండుద్వారా లభించే మంచికొవ్వు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. చర్మకాంతిని పెంచుతుంది.ఇందులోని పొటాషియం శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ బ్యాలెన్సింగ్ ఏజెంట్గా పనిచేస్తుంది. కండరాల పెరుగుదలకు దోహదం చేస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. అంతేకాదు, సహజ యాంటీ బయాటిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణం కలిగిన రామాఫలం విరేచనాలను నియంత్రిస్తుంది. న్యూమోనియా, టైఫాయిడ్ వంటి అనారోగ్యాలకూ ఔషధంగా పనిచేస్తుంది.ఇందులోని క్యాల్షియం ఎముకలకు సత్తువనిస్తుంది. ఎముకలు పెళుసు బారడం, కీళ్లనొప్పుల సమస్యలు దూరమవుతాయి. చర్మం అక్కడక్కడ నలుపు రంగులోకి మారే హైపర్ పిగ్మెంటేషన్ సమస్య నివారణకు రామాఫలం దివ్యౌషధంగా పనిచేస్తుంది. దీని గుజ్జును ఫేస్ప్యాక్లా వేసుకుంటే నలుపు మటుమాయం అవుతుంది. రామాఫలాన్ని తినడమే కాదు దీని గుజ్జును హెయిర్ప్యాక్లా వేసుకోవచ్చు. దీనివల్ల చుండ్రు సమస్య తొలగిపోతుంది. జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.ఈ పండులోని ఫైబర్ జీర్ణవ్యవస్థను ప్రోత్సహిస్తుంది. పేగులను శుభ్రం చేసి జీర్ణాశయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దురద తగ్గించడంలో, చర్మ సంరక్షణలో, వార్ధక్య ఛాయలను నియంత్రించడంలో రామాఫలం ఔషధంగా పనిచేస్తుంది.

హార్దిక్ పాండ్యా బౌలింగ్, కెప్టెన్సీ సరిగాలేదు: గవాస్కర్

ముంబై: ఐపీఎల్లో ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఇటీవల తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఇక ఆదివారం చెన్నైతో జరిగిన మ్యాచ్లోనూ ముంబై జట్టు ఓటమి చవి చూసింది. అయితే ఆ మ్యాచ్లో పాండ్యా బౌలింగ్, కెప్టెన్సీ చాలా పేలవంగా ఉన్నట్లు మాజీ క్రికెటర్ గవాస్కర్ ఆరోపించారు. ముంబై కెప్టెన్సీ చేపట్టిన నాటి నుంచి హార్దిక్పై ఆన్లైన్లో విమర్శలు వెల్తువెత్తుతున్న విషయం తెలిసిందే. పాండ్యా వేసిన ఫైనల్ ఓవర్లో 26 రన్స్ వచ్చాయి. దాంట్లో ధోనీ ఒక్కడే 20 రన్స్ స్కోర్ చేశాడు. దీనిపై గవాస్కర్ కామెంట్ చేశాడు. ఇది నిజంగా పసలేని బౌలింగ్, కెప్టెన్సీ అని, రుతురాజ్ గైక్వాడ్, శివం దూబేలు బాగా ఆడినా.. రన్స్ను అదుపు చేశారని, చెన్నైని 190 లోపే కట్టడి చేస్తే బాగుండేదని, కానీ చాలా దారుణమైన బౌలింగ్ వేసినట్లు గవాస్కర్ పేర్కొన్నాడు. మొదటి సిక్స్ ఓకే అని, మూడు ఓవర్లు వేసిన పాండ్యా రెండు వికెట్లు తీసుకుని 43 రన్స్ ఇచ్చాడు.స్టేడియంలోని అరుపులు, కేకల ప్రభావం పాండ్యాపై ఎక్కువ ఉన్నట్లు అర్థమవుతోందని పీటర్సన్ తెలిపారు. టాస్ వేస్తున్న సమయంలోనూ అతను ఎక్కువగా నవ్వుతున్నాడని, సంతోషంగా ఉన్నట్లు కనిపించేందుకు నటిస్తున్నాడని, అతను సంతోషంగా లేడని, అలాంటి పరిస్థితిని ప్రత్యక్షంగా చూశానని, పాండ్యాను ధోనీ అన్ని దిక్కులా దంచేశాడని, అది నిన్ను బాధకు గురిచేస్తుందని, ఇలాంటి ఘటన వల్ల ఆటపై ప్రభావం పడుతుందని, పాండ్యా ఏదో ఒకటి చేయాల్సి ఉంటుందని పీటర్సన్ తెలిపాడు. పేసర్లను టార్గెట్ చేస్తున్న సమయంలో పాండ్యా ఎందుకు స్పిన్నర్లను వాడలేదని ప్రశ్నించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.